
సాక్షి పల్నాడు

గురువారం । 25 । సెప్టెంబర్ । 2025



సోలార్ విద్యుత్ ప్యానెల్స్ ప్రారంభం

పిడుగురాళ్ల: పట్టణంలో సోలార్ విద్యుత్ ప్యానెల్స్‌ను పల్నాడు జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ డాక్టర్ పి.విజయ్ కుమార్ బుధవారం ప్రారంభించారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3,68,435 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా ప్రాజెక్టు దిగువకు 3,82,670 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్టులో 34.6755 టీఎంసీలు ఉంది.



పర్యాటక కేంద్రాల సందర్శన

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ పరిధిలోని పర్యాటక ప్రాంతాలను జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా బుధవారం సందర్శించారు. ఉద్యోగులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.



నరసరావుపేటలో వైష్ణవి అలంకరణలో పార్వతీ అమ్మవారు



పిడుగురాళ్లలోని సత్యసాయి దేవాలయంలో నిమ్మకాయలతో ప్రత్యేక అలంకరణ



పిడుగురాళ్లలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



సత్తెనపల్లిలోని త్రిశక్తిదుర్గా పీఠంలో అన్నపూర్ణాదేవిగా...

నిత్యాన్నదానేశ్వరి.. అన్నపూర్ణేశ్వరి

నిత్యాన్నదానేశ్వరి అలంకారంలో దుర్గమ్మను దర్శించి తరించడం వల్ల అన్నాదులకు లోపం లేకుండా, ఇతరులకు అన్నదానం చేసే సౌభాగ్యాన్ని పొందగలుగుతారనేది భక్తుల నమ్మకం. శరన్నవరాత్రుత్సవాలలో భాగంగా బుధవారం పలు ఆలయాల్లో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పల్నాడు జిల్లాలోని నరసరావుపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మాచర్ల, చిలకలూరిపేట, వినుకొండ తదితర ప్రాంతాలలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. పిడుగురాళ్లలో భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు.

–సాక్షి నెట్‌వర్క్

న్యూస్‌రీల్

వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన పీఆర్కే



మాచర్ల: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లి పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) మర్యాదపూర్వకంగా కలిశారు. మాచర్ల నియోజకవర్గంలో కార్యకర్తలపై నమోదవుతున్న అక్రమ కేసులు, ప్రజలు భయంతో గ్రామాలు వదిలి వెళ్లిపోతున్న విషయాన్ని వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు.

గాయత్రీ దేవిగా బాలచాముండేశ్వరి



అమరావతి: ప్రముఖ శైవక్షేత్రం అమరావతి బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్ర్యుత్సవాలలో భాగంగా బుధవారం బాలచాముండేశ్వరి అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. దసరా వేడుకలలో మూడో రోజు సహస్ర కుంకుమార్చన, దేవిఖడ్గమాల, త్రిశల, లలితా సహస్ర నామార్చన, శ్రీ చక్రార్చనతోపాటుగా గాయత్రీ దేవికి సంధ్యా సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్ధని అమ్మవార్లకు కూడా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించి ప్రత్యేక కుంకుమార్చనలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయాలలో పూజలలో పాల్గొన్నారు.

జిల్లా మత్స్యశాఖ అధికారిగా వెంకట్రావు



నరసరావుపేటరూరల్: జిల్లా మత్స్యశాఖ అధికారిగా ఐ.వెంకట్రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వెంకట్రావుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాలు జారీ చేశారు. గతంలో మత్స్యశాఖ జిల్లా అధికారిగా పనిచేసిన సంజీవరావుపై ఆరోపణలు రావడంతో ప్రభుత్వానికి సరెండర్ చేస్తూ ఈనెల 11వ తేదీన అప్పటి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుత కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు వెంకట్రావు అదనపు బాధ్యతలు స్వీకరించారు.

శింగరకొండ ఆలయ పాలక మండలి నియామకం

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం నూతన పాల మండలిని నియమించారు. అధ్యక్షుడుగా చుండూరి మురళీ సుధాకరరావుతో పాటు సభ్యులుగా ఆకుల కోటేశ్వరరావు, బత్తుల చంద్రశేఖర్, నూతి లక్ష్మీ ప్రసాద్, మందా సునీత, ఏల్చూరి వెంకట నారాయణమ్మ, ధూళిపాళ్ల వెంకటరత్నం, గొర్రెపాటి పద్మజ, హరబోలు నాగమ్మ, దేవరపల్లి సురేష్‌బాబు, కొనంకి సుబ్బారావు నియమితులయ్యారు.

గుంటూరుకు ఏమైంది ?

- అంతం కాని డయేరియా భూతం
- అదుపులోకి రాని వ్యాధి
- ప్రతిరోజూ జీజీహెచ్‌లో బాధితుల చేరిక
- రాత్రి సమయాల్లో ఎక్కువగా అడ్మిషన్లు
- 165 మందికి పైగా బాధితులకు చికిత్స
- కట్టడి చేయడంలో విఫలమవుతున్న అధికారులు



జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న రోగులు

గుంటూరుమెడికల్: డయేరియా భూతం గుంటూరు నగరాన్ని పట్టి పీడిస్తోంది. అధికారుల నిర్లక్ష్యంతో బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పది రోజులుగా నగరంలో వాంతులు, విరేచనాల కేసులు నమోదవుతూనే ఉన్నాయి. నిత్యం పెద్ద సంఖ్యలో బాధితులు చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కి వస్తున్నారు. వ్యాధిని కట్టడి చేయడంలో అధికార యంత్రాంగం విఫలమైందనే విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి.

కలరా భయంతో వణుకు

ఓ పక్క డయేరియాతో వణికిపోతున్న నగర ప్రజానీకానికి మరోపక్క కలరా భయం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అధికారులు గణాంకాల ప్రకారం గుంటూరుకి చెందిన ముగ్గురు కలరాతో జీజీహెచ్‌లో చికిత్స పొంది, డిశ్చార్జి అయ్యారు. పూర్తిస్థాయిలో నివేదికలు బయటకు రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. వాస్తవ పరిస్థితులను కూడా అధికారులు దాస్తున్నారు. డయేరియా, కలరా బాధితుల గణాంకాలు వివరించేందుకు ముందుకు రావడం లేదు. ప్రభుత్వంపై వ్యతిరేకత పెరుగుతుందనే కారణాలతో సాధ్యమైనంత మేరకు గణాంకాలను దాచి పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. వివరాలు చెబితే వారిపై క్రమశిక్షణా చర్యలు ఉంటాయనే భయంతో అన్ని శాఖల వారు మౌనంగా ఉంటున్నారు.

వ్యాధి కట్టడిలో కీలకం

సాధారణంగా డయేరియా, కలరా లాంటి వ్యాధులు ఉన్న ప్రాంతాల్లో ప్రజలను ముందస్తుగా అధికారులు అప్రమత్తం చేయాలి. వ్యక్తిగతంతో పాటు పరిసరాల పరిశుభ్రత కూడా ఈ వ్యాధుల కట్టడిలో కీలకం. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదు. మురుగు కాలువల్లో తాగునీటి పైప్‌లైన్లు ఇంకా మునిగే ఉన్నాయి. గతంలో జరిగిన ప్రాణ నష్టం నుంచి గుణపాఠాలు నేర్చుకోవడం లేదు. విధుల నిర్వహణలో నిర్లిప్తతను ప్రదర్శిస్తున్నారు.

ఏ మాత్రం తగ్గని డయేరియా

ఈనెల 15న గుంటూరు జీజీహెచ్‌లో మొట్టమొదటిసారిగా డయేరియా బాధితులు అడ్మిట్ అయ్యారు. నాటి నుంచి ప్రతిరోజూ చికిత్స కోసం వస్తూనే ఉన్నారు. ఇటీవల కలరా కలకలం తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. ఒకవైపు డయేరియా, మరోవైపు కలరాతో ఈ నగరానికి ఏమైందంటూ మేధావులు సైతం పెదవి విరుస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ఇప్పటి వరకు 165 మందికి పైగా డయేరియాతో చికిత్స పొందారు. వీరిలో ఆరోగ్యం కుదుటపడిన సుమారు 80 మందిని డిశ్చార్జి చేశారు. వాంతులు, విరేచనాలు ఎక్కువగా అవడంతో కిడ్నీల సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉన్న ముగ్గురిని ఐసీయూలో అడ్మిషన్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. తొలుత డయేరియా బాధితుల కోసం ఇన్‌పేషెంట్ విభాగంలోని జనరల్ సర్జరీ విభాగం 333 నంబరును కేటాయించారు.

అగ్రగామిగా నిలిస్తే రూ.కోటి నజరానా

పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం వరం



నందిగామ గ్రామ పంచాయతీ ఏరియల్ వ్యూ

సత్తెనపల్లి: తొమ్మిది అంశాల్లో పురోగతి సాధించిన గ్రామ పంచాయతీలకు కేంద్రం రూ.కోటి బహుమతి ఇవ్వనుంది. ప్రస్తుతం జిల్లాలో చాలా పంచాయతీల్లో కనీస సౌకర్యాల కొరత వేధిస్తోంది. తాగునీటితోపాటు మురుగు కాలువలు, రహదారులు, ఇతర సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. దీన్ని అధిగమించడానికి గ్రామ పంచాయతీలో చేయాల్సిన అభివృద్ధి కార్యక్రమాలను సూచికలో పొందుపరిచింది. డిసెంబర్‌లో పురోగతి సూచిక ప్రగతిని గుర్తించి ఎంపికైన గ్రామ పంచాయతీలను ప్రకటిస్తారు.

ప్రగతిపథంలో నడిచేలా...

జిల్లాలో 526 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో ఆదర్శ పంచాయతీలుగా తీర్చి దిద్దేందుకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖలు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేశాయి. ఇందు కోసం గ్రామపంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి తగిన చర్యలు తీసుకుంటున్నారు.

తొమ్మిది అంశాలు ఇవి...

- గ్రామపంచాయతీలో పేదరికం లేని జీవనోపాధిని పెంపొందించడం
- ప్రజారోగ్యం, గ్రామ శ్రేయస్సును మెరుగుపరిచే కార్యక్రమాలు
- ప్రజలకు స్వచ్ఛమైన నీరు పుష్కలంగా అందుబాటులోకి తేవడం
- పిల్లల సంరక్షణ, అభివృద్ధికి అనుకూలమైన వాతావరణం కల్పించడం
- గ్రామాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దడం
- మౌలిక సదుపాయాల కల్పన
- సామాజిక న్యాయాన్ని సురక్షిత వాతావరణంలో నెలకొల్పడం
- శాంతియుతమైన, న్యాయమైన, బలమైన సంస్థలతో సుపరిపాలన
- పంచాయతీ సమగ్ర అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్యం తదితర అంశాలు.

రాష్ట్రపతితో విందుకు జాతీయ స్థాయి అవార్డు గ్రహీత

- సత్తెనపల్లికి చెందిన కర్నాటి మురళికి దక్కిన అరుదైన అవకాశం
- చేనేత రంగంలోని ఇక్కత్ డిజైన్‌లో ప్రతిభకు గుర్తింపు



రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో గ్రూప్ ఫొటోలో కర్నాటి మురళి

సత్తెనపల్లి: రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో కలిసి విందు చేసే అరుదైన అవకాశం సత్తెనపల్లికి చెందిన జాతీయ స్థాయి అవార్డు గ్రహీత కర్నాటి మురళికి దక్కింది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 19 మంది జాతీయ స్థాయి అవార్డు గ్రహీతలతో కలసి ద్రౌపదీ ముర్ముతో విందు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లికి చెందిన కర్నాటి మురళి చేనేత రంగంలో చూపిన ప్రతిభ ఆయనను జాతీయ స్థాయి అవార్డుకు ఎంపిక చేసింది. ఇక్కత్ డిజైన్ కళను భవిష్యత్ తరాలకు అందించాలని నాలుగున్నర దశాబ్దాలుగా చేనేత డిజైన్లపై కర్నాటి మురళి కృషి చేస్తున్నారు. అమరావతిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్‌లో ఇక్కత్ డిజైన్లపై శిక్షణ ఇస్తున్నాడు. ఈ క్రమంలో గత జూలైలో దేశవ్యాప్తంగా 19 మందికి జాతీయ స్థాయి అవార్డులు ప్రకటించగా .. ఆంధ్రప్రదేశ్ నుంచి సత్తెనపల్లికి చెందిన కర్నాటి మురళి జాతీయ ఉత్తమ నేత వృత్తిదారుడి అవార్డుకు ఎంపికయ్యారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ అవార్డును రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా అందుకోవాల్సి ఉంది. ఆమె ఆ రోజు అందుబాటులో లేకపోవడంతో కేంద్ర మంత్రుల చేతుల మీదుగా మురళి అవార్డు అందుకున్నారు. ఈ క్రమంలో దేశ వ్యాప్తంగా ఎంపికైన 19 మంది జాతీయ స్థాయి అవార్డు గ్రహీతలతో కలిసి మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము విందు ఆరగించారు. కర్నాటి మురళికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో విందు చేసే అరుదైన అవకాశం లభించింది. అనంతరం కలిసి గ్రూప్ ఫొటో దిగారు. మురళి మాట్లాడుతూ తన తండ్రి సాంబయ్య ద్వారా నేర్చుకున్న చేనేత కళా నైపుణ్యం ద్వారా జాతీయ స్థాయిలో అవార్డు అందుకోవడమే కాక రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో కలిసి విందు చేసే అవకాశం రావడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. మురళిని స్ఫూర్తి విద్యాసంస్థల బాధ్యుడు అబ్బూరి సత్యనారాయణతో పాటు పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

సాంకేతికత వినియోగంతో లాభసాటి వ్యవసాయం

జిల్లా ప్రాజెక్టు మేనేజర్ అమలకుమారి



నాగిరెడ్డిపాలెంలో డ్రోన్ వినియోగాన్ని వివరిస్తున్న డీపీఎం అమలకుమారి

బెల్లంకొండ: రైతులు సాగులో ప్రకృతి వ్యవసాయ విధానం, సాంకేతికతను వినియోగించడం ద్వారా లాభసాటిగా మార్చుకోవచ్చని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపాలెం గ్రామంలో బుధవారం ప్రకృతి వ్యవసాయ విధానంతో సాగవుతున్న వరి పంటలను పరిశీలించారు. రైతులు కూలీల కొరతతో మందులు కషాయాల పిచికారీలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా డ్రోన్ పరికరాలను అందుబాటులో తీసుకువచ్చిందని పేర్కొన్నారు. డ్రోన్ల ద్వారా తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో సహజ ద్రావణాలను విస్తృతంగా పిచికారీ చేయవచ్చని తెలిపారు. సబ్సిడీ ద్వారా అందించే డ్రోన్ల వినియోగాన్ని రైతులకు వివరించారు. ఘన, ద్రవ జీవామృతం, దశపరిని కషాయం, నీమాస్త్రం వంటి కషాయాలను కూడా డ్రోన్ల సహాయంతో పిచికారీ చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఎన్‌ఎఫ్‌ఏ సైదయ్య, ఎంటీ అనంతలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అన్న ప్రసాదిని..అభయ ప్రదాయిని

- మూడో రోజూ ఇంద్రకీలాద్రిపై అదే రద్దీ
- తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ కొనసాగిన వైనం
- అన్న ప్రసాద స్వీకరణకు భక్తుల బారులు
- నేడు శ్రీ కాత్యాయనీదేవిగా దుర్గమ్మ దర్శనం





దుర్గమ్మ దర్శనం కోసం తరలివచ్చిన భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై దేవి శరన్నవరాత్రి మహోత్సవాల్లో మూడో రోజైన బుధవారం దుర్గమ్మ శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని శ్రీఅన్నపూర్ణాదేవిగా దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు అమ్మవారికి విశేష అలంకరణ, పూజా కార్యక్రమాలు, బాలభోగం నివేదన అనంతరం భక్తులను అమ్మవారి దర్శనానికి అనుమతించారు. సర్వ దర్శనం మూడు క్యూలైన్లలో ఉదయం నుంచి సాయంత్రం వరకు రద్దీ కొనసాగుతూనే ఉంది. సాయంత్రం అమ్మవారి మహా నివేదన, పంచహారతుల తర్వాత భక్తుల రద్దీ మరింత పెరిగింది. కెనాల్‌రోడ్డులోని వినాయకుడి గుడితో పాటు కుమ్మరిపాలెం వైపు క్యూలైన్లు భక్తులతో రద్దీగా కనిపించాయి.

సర్వ దర్శనం క్యూలైన్లలో రద్దీ

బుధవారం తెల్లవారుజాము నుంచి సర్వ దర్శనం క్యూలైన్లలో భక్తుల రద్దీ కొనసాగింది. సాధారణ భక్తులతోపాటు భవానీ దీక్షలు స్వీకరించిన భక్తులు క్యూలైన్‌లో ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. అయితే ఉపవాసంతో ఉండే భవానీలకు ప్రత్యేక ఏర్పాటు చేయకపోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్నాటకలకు చెందిన భక్తులు అమ్మవారి దీక్షలను స్వీకరించి దర్శనానికి వచ్చారు. తెల్లవారుజాము నుంచి రాత్రి 11 గంటల వరకు సర్వ దర్శనం క్యూలైన్‌లో రద్దీ ఏకధాటిగా కొనసాగుతూనే ఉంది.

వీఐపీ క్యూలైన్‌లో అనుమతి..

సేవా బృంద సభ్యులు, పోలీసు సిబ్బంది ఎవరైనా వీఐపీ క్యూలైన్ ద్వారానే అమ్మవారి దర్శనం చేసుకోవాలని ఈవో శీనానాయక్, ఏడీసీపీ జి.రామకృష్ణ సూచించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని స్కానింగ్ పాయింట్, మీడియా పాయింట్ల వద్ద పలుమార్లు తనిఖీలు నిర్వహించారు. సిఫార్సులతో అమ్మవారి దర్శనం కోసం నేరుగా వస్తున్న వారిని ఆపి కార్డులు తనిఖీలు చేశారు. దీంతో బుధవారం చిన్న గాలిగోపురం పరిసరాల్లో, సీఎం గేటు వద్ద రద్దీ కొంత అదుపులోకి వచ్చింది.

అన్నదాన భవనంలో తనిఖీలు..

అమ్మవారి అన్నప్రసాదం కోసం తరలివచ్చిన భక్తులతో మహా మండపం ఎదుట నూతనంగా నిర్మించిన అన్నదాన భవనం కిటకిటలాడింది. మరో వైపున అన్న ప్రసాద నాణ్యతలలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్‌కలెక్టర్ ఎస్.ఇలక్కియ వేరు వేరుగా తనిఖీలు నిర్వహించారు.

మూడో రోజు ఆదాయం రూ.31.08లక్షలు

దసరా ఉత్సవాలలో మూడో రోజైన బుధవారం దేవస్థానానికి రూ.31.08 లక్షల మేర ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు పేర్కొన్నారు. రూ.300 టికెట్ల విక్రయం ద్వారా రూ.10.56లక్షలు, రూ.100 టికెట్ల విక్రయం ద్వారా రూ.3.46లక్షలు, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ. 2.98లక్షలు, ఆరు లడ్డూ బాక్స్‌ల విక్రయం ద్వారా రూ.11.89 లక్షలు, ఆర్జిత సేవా టికెట్ల విక్రయం, ఇతర సేవల ద్వారా రూ.2.10 లక్షల మేర ఆదాయం లభించిందని పేర్కొన్నారు. ఇక సాయంత్రం 5 గంటల వరకు 58 వేల మంది భక్తులు అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా దర్శించుకున్నారని, అన్నప్రసాదం 22,506 మందికి పంపిణీ చేశామని పేర్కొన్నారు.

చూసిన కనులదే భాగ్యం

శ్రీగంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వార్ల నగరోత్సవం కనుల పండువగా సాగింది. యాగశాల వద్ద పల్లకీపై ఉత్సవ మూర్తులు అధిరోహించారు. ఆలయ అర్చకులు ఉత్సవ మూర్తులకు పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కోలాట నృత్యాల మధ్య నగరోత్సవం ప్రారంభమైంది. సప్తవర్ణాలు కలిగిన పుష్పాలతో అలంకరించిన పల్లకీపై ఆదిదంపతులు ముగ్ధమనోహరంగా భక్తులకు దర్శనమిచ్చారు.

మహామండపం, కనకదుర్గనగర్, ఘాట్‌రోడ్డు మీదగా ఊరేగింపు ఆలయానికి చేరుకుంది. ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం ఎదుట ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

ఇంద్రకీలాద్రిపై నేడు..

- గురువారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి అమ్మవారి దర్శనం
- ఉదయం ఆరు గంటలకు ప్రత్యేక ఖడ్గమాలార్చన(ఆరో అంతస్తు)
- ఉదయం 7 గంటలకు ప్రత్యేక కుంకుమార్చన(ఆరో అంతస్తు)
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక చండీయాగం (యాగశాల)
- ఉదయం 9 గంటలకు ప్రత్యేక శ్రీచక్రనవార్చన(లక్ష కుంకుమార్చన వేదిక)
- సాయంత్రం 5 గంటలకు శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి నగరోత్సవ సేవ
- సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి మహా నివేదన, పంచహారతుల సేవ, వేద స్వస్తి
- రాత్రి 11 గంటల వరకు అమ్మవారి దర్శనం

నేటి అలంకారం శ్రీ కాత్యాయనీ దేవి



ఉత్సవాల్లో భాగంగా 4వ రోజు దుర్గమ్మ శ్రీ కాత్యాయనీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారు.

పూర్వం కత అనే మహర్షికి దేవీ ఉపాసన వల్ల ఒక కుమారుడు కలిగాడు. చిన్నతనం నుంచే తండ్రి నుంచి భక్తిని అలవర్చుకున్న ఆ తపస్వికి కాత్యాయనుడు అనే పేరు. ఇతను దేవీ భక్తుడు అవ్వడంతో దేవీనే పుత్రికగా పొందదలచి గొప్ప తపస్సు చేశాడు. దేవీ ప్రసన్నురాలై మహర్షికి పుత్రికగా జన్మించింది. కాత్యాయనుడి పుత్రిక కనుక ఆ తల్లిని కాత్యాయనీదేవిగా కొలుస్తారు. కాత్యాయనీదేవిని ఆరాధించడం వల్ల చతుర్విధ పురుషార్థాలు సిద్ధిస్తాయి. రోగం, శోకం, భయం నశిస్తాయి. ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు ఇంట వర్ధిల్లుతాయి.

సాగర్ కాలువకు గండి



దగ్గుబాడు సమీపంలో కోతకు గురైన సాగర్ కట్ట

కారంచేడు: మండలంలోని దగ్గుబాడు సమీపంలో సాగర్ కాలువ కట్ట కోతకు గురైంది. గండి పడిన సమయంలో 130 క్యూసెక్కులు ప్రవహిస్తోంది. గత రెండు, మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వరద నీరు కూడా వచ్చి చేరింది. దీంతో ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగింది. కట్టలు పటిష్టంగా లేకపోవడంతో ఈ ప్రమాదం తలెత్తింది.

50 ఎకరాలు మునక

కాలువలోని నీరు సుమారు 50 ఎకరాల్లోకి చేరింది. ప్రస్తుతం పంటలు ఇంకా సాగు చేయక పోవడంతో ఇటు అధికారులు, అటు రైతులు ఊపిరి పీల్చుకున్నారు. కాలువలను శుభ్రం చేయించి, అవసరమైన మరమ్మతులు చేయించాలని రైతులు కోరుతున్నారు. పర్చూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో సాగర్ ఆయకట్టుతోపాటు, కొమ్మమూరు కాలువ ఆయకట్టే ఆధారం. గత ఏడాది సాగర్ కాలువ కట్టల పైన జంగిల్ క్లియరెన్స్ సమయంలో వాటిని పటిష్ట పరచాలని రైతులు డిమాండ్‌చేసినా అధికారులు పట్టించుకోలేదు. ప్రమాదం గురించి ఎన్‌ఎస్‌పీ జేఈ రాజేష్‌ను వివరణ కోరగా, ప్రస్తుతం నీటి ప్రవాహానికి ఓవర్‌ఫ్లో అయిందని, బలహీనంగా ఉన్న కట్ట కోతకు గురైందని వివరణ ఇచ్చారు. వెంటనే చిమ్మిరి బండ లాకుల వద్ద నీటి ప్రవాహం నిలుపుదల చేశామని తెలిపారు. ప్రవాహం తగ్గిన తరువాత తాత్కాలిక మరమ్మతులు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. వేసవిలో శాశ్వత పరిష్కారం కోసం ప్రతిపాదనలు చేస్తామని వివరించారు.

మిర్చి యార్డు సమాచారం
(బుధవారం ధరలు)

వచ్చిన బస్తాలు	33,605
అమ్మకాలు	31,926
నిల్వ	10,473



నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,300
నంబరు–5	10,000–14,000
341	10,000–15,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–14,500
నంబరు–5	10,000–14,200
341	10,000–15,200
4884	10,000–13,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 14,500
బాడిగ–355	10,000 – 14,800
దేవనూరు డీలక్స్	10,000 – 14,000
ఆర్మూర్	9,800 – 12,000
తాలుకాయలు	6,000 – 6,800

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–14,700
బాడిగ – 355	10,000–14,900
దేవనూరు డీలక్స్	10,500–14,000
తాలు	5,200 – 6,500

–కొరిటెపాడు (గుంటూరు)

అతివృష్టితో అపర నష్టం!

- అపరాల పంటలు వర్షార్పణం
- నిండా మునిగిన రైతులు
- పత్తి, జ్యూట్ పంటలకు పొంచిఉన్న ముప్పు



అపరాల పొలాల్లో చేరిన వర్షం నీరు

తాడికొండ: అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు కుదేలవుతున్నారు. మబ్బుకు చిల్లుపడిందా అన్న చందంగా ప్రతి రోజు వాన కురుస్తుండటంతో రైతన్నలు పంట పొలాల్లో అడుగు పెట్టేందుకు కూడా వీలులేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే అరకొరగా సాగుచేసిన అపరాల పంటలు వర్షార్పణం కాగా పత్తి పంట ఎదుగుదల లేక ఎర్రబారుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక జ్యూట్ పంట పరిస్థితి కూడా ఇదేవిధంగా మారడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా పొలంలోకి అడుగు పెట్టి అంతర కృషి చేసే పరిస్థితి కూడా లేని కారణంగా పై పాటుగా మందుల పిచికారీ కలుపు ఏరివేత కూడా చేయలేని పరిస్థితితో పొలాలు పిచ్చి కంపల్లా మారుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గుండె 'చెరువు' అయింది!

ఈ ఏడాది నెలకొన్న అతివృష్టి పరిస్థితుల కారణంగా ఇప్పటి వరకు పెట్టుబడుల రూపంలో పెట్టిన సొమ్ము అయినా తిరిగొస్తుందా లేదా అనే బెంగ అన్నదాతల్లో పట్టుకుంది. కొండవీటి వాగు ఉధృతికి తాడికొండ, తుళ్ళూరు మండలాల్లో వేలాది ఎకరాల్లో పంటలు గత రెండు నెలలుగా నానుతున్నాయి. పంటనష్టం పరిహారం అంచనాలు రూపొందించి అన్నదాతకు అండగా నిలవాల్సిన వ్యవసాయాధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా యత్నించిన దాఖలాలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఓ వైపు యూరియా సరఫరా లేక ప్రభుత్వం చేతులెత్తేయగా.. అధిక ధరలు వెచ్చించి కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేసి పెట్టుబడులు పెట్టామని, తీరా ఇప్పుడు పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని రైతులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కొండవీటి వాగు ముంపునకు గురైన రైతులకు న్యాయం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నీట మునిగిన జ్యూట్ పైరు



తాడికొండ - నీరుకొండ మధ్య పంట పొలాలకు వెళ్లే రహదారిపై పడిన భారీగండి

ఆసియా అక్వాటిక్ పోటీలకు పరిశీలకునిగా సురేష్



జి.సురేష్, స్విమ్మింగ్ కోచ్

నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల స్విమ్మింగ్ పూల్ కోచ్ జి.సురేష్‌కు అరుదైన గౌరవం లభించింది. ఈనెల 28వ తేదీ నుంచి ప్రారంభం కానున్న 11వ ఆసియా అక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీలకు భారతదేశం తరపున టెక్నికల్ ఆఫీషియల్‌గా ఎంపికయ్యారు. పోటీలు ఈనెల 28 నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించనున్నట్లు సురేష్ బుధవారం తెలిపారు. ఆసియాలోని దాదాపు 30 దేశాలకు చెందిన స్విమ్మర్లు స్విమ్మింగ్, డైవింగ్, వాటర్ పోలో, సింక్రొనైస్ తదితర విభాగాలలో పోటీ పడనున్నారు. భారతదేశం నుంచి సురేష్ గతంలో ఆఫ్రో- ఆసియన్ గేమ్స్, వరల్డ్ మిలటరీ గేమ్స్, ఆసియా ఏజ్ గ్రూప్ చాంపియన్‌షిప్, నేషనల్ చాంపియన్‌షిప్ వంటి జాతీయ, అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా వ్యవహరించారు. పల్నాడు జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఏ.ఏ.రామలింగారెడ్డి, కార్యదర్శి వై.వి.సుబ్బారెడ్డి, కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వైస్‌ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి తదితరులు స్విమ్మింగ్ కోచ్ సురేష్‌ను అభినందించారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశ గడువు పొడిగింపు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం దూరవిద్య (ఓపెన్ స్కూల్) ద్వారా 10వ తరగతి, ఇంటర్మీడియేట్ కోర్సులలో 2025–26 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాలకు రూ.200 అపరాధ రుసుంతో అక్టోబర్ 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థులు 10వ తరగతిలో ప్రవేశం పొందేందుకు 14 సంవత్సరాలు వయస్సు నిండి ఉండాలన్నారు. ఏదైనా విద్యార్హత పత్రాలు, టీసీ, ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ, బ్యాంక్ పాస్ బుక్ కలిగి అందజేయాలని తెలిపారు. దివ్యాంగ అభ్యర్థులు వారి వైద్య ధ్రువీకరణ, ఎటువంటి విద్యార్హత లేకున్నా చదవటం, రాయటం వచ్చునని స్వయ ధ్రువీకరణ అందజేయాల్సి ఉంటుందని వివరించారు. ఇంటర్మీడియేట్ ప్రవేశానికి 10వ తరగతి ఉత్తీర్ణులై, ఇతర అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలని స్పష్టం చేశారు. అర్హత గల అభ్యర్థులు తమకు సమీపంలోని ఓపెన్ స్కూల్ సెంటర్‌కు వెళ్లి తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు అందచేసి ఫీజు చెల్లించి ప్రవేశం పొందాలని కోరారు.

వ్యాపారి అదృశ్యంతో రైతుల ఆందోళన

సత్తెనపల్లి: నల్ల పసుపు సాగు చేసిన రైతుల నుంచి ఉత్పత్తులు కొనుగోలు చేసిన వ్యాపారి అదృశ్యం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. సత్తెనపల్లి మండలం అబ్బూరు, లక్కరాజుగార్లపాడు, రాజుపాలెం మండలం గణపవరం, బలిజేపల్లి, బీరవల్లిపాయ, ఫిరంగిపురం మండలం యర్రగుంట్లపాడు గ్రామాల్లో సుమారు 15 మంది రైతులు నల్ల పసుపు సాగు చేశారు. రాజుపాలెం మండలం గణపవరం గ్రామానికి చెందిన నల్లబోతుల అచ్చయ్య మధ్యవర్తిత్వం ద్వారా కిలో రూ.250 చొప్పున విత్తనాలు కొనుగోలు చేసి, రైతులు సాగు చేశారు. ఒక్కో రైతు రూ.4.50 లక్షలు సాగుకు పెట్టుబడి పెట్టారు. గత ఏడాది జూన్‌లో పంట సాగు చేపట్టగా ఈ ఏడాది ఏప్రిల్‌లో పంట ఉత్పత్తి చేతికి వచ్చింది. కర్ణాటక రాష్ట్రం హుబ్లీలోని ఎస్ఆర్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ బోయపాటి రంజిత్‌కుమార్ నల్ల పసుపు ఉత్పత్తులను కొనుగోలు చేశాడు. రైతులకు నగదు చెల్లించే విషయంలో గణపవరం గ్రామానికి చెందిన అచ్చయ్య హామీగా ఉన్నాడు. ఏప్రిల్‌లో నల్ల పసుపు కిలో రూ.100 చొప్పున పంట ఉత్పత్తులు విక్రయం చేపట్టగా మొత్తం సుమారు రూ.మూడు కోట్లు రావాల్సి ఉంది. పంట ఉత్పత్తులు కొనుగోలు చేసిన వ్యాపారి రంజిత్‌కుమార్ ఫోన్ పని చేయకపోవడంతో మధ్యవర్తి అయినా అచ్చయ్య పై రైతులు ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు రైతులకు పెట్టుబడి పెట్టడమే తప్ప తిరిగి నగదు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వీరిలో కొందరు పోలీసులను ఆశ్రయించినట్లు తెలుస్తోంది. అయితే పోలీసులు ఎలాంటి కేసులు నమోదు చేయ లేదు.

క్లుప్తంగా

కేఎల్‌యూ ప్రొఫెసర్లకు ప్రపంచ శాస్త్రవేత్తలుగా గుర్తింపు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రపంచ అగ్రశ్రేణి శాస్త్రవేత్తలుగా కేఎల్‌యూ ప్రొఫెసర్లకు గుర్తింపు లభించింది. ప్రపంచ ప్రఖ్యాత అమెరికా స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ, ఎల్సెవియర్ డేటాబేస్ విడుదల చేసిన జాబితాలో 20 మంది కేఎల్‌యూ ప్రొఫెసర్లు ఉన్నారు. తమ అధ్యాపక బృందంలో 20 మంది ప్రపంచంలోని అత్యున్నత రెండు శాతం శాస్త్రవేత్తలుగా గుర్తింపు పొందారని ప్రకటించడానికి గర్వంగా ఉందని కేఎల్‌యూ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథివర్మ తెలిపారు. విజయవాడ మ్యూజియం రోడ్డులోని సంస్థ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

ముగిసిన చేతిరాత శిక్షణ శిబిరం



పురస్కారాలు అందుకున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

గుంటూరు రూరల్: అందమైన చేతిరాత అదృష్టమని, అది ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుందని విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు మున్నంగి సంజీవరెడ్డి తెలిపారు. శ్రీమతి చేబ్రోలు మహాలక్ష్మి పుల్లయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి చేతిరాత శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సంజీవరెడ్డి మాట్లాడుతూ అందమైన చేతిరాత వలన విద్యార్థులు పరీక్షల్లో అదనంగా మార్కులు సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. జాతీయ అవార్డు గ్రహీత వి.రామమోహనరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 70 వేల మంది విద్యార్థులు, 15 వేల మంది ఉపాధ్యాయులు చేతిరాతలో శిక్షణ పొందారన్నారు. వీరగంగాధరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. చైల్డ్ లైన్ వెల్ఫేర్ బోర్డు రిటైర్డ్ అధికారి ప్రసాదలింగం మాట్లాడుతూ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా శిక్షణ పొందటం అమూల్యమైనదని ప్రశంసించారు. రిటైర్డ్ ఉపాధ్యాయురాలు మల్లీశ్వరి మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజానికి, విద్యార్థులకు అందిస్తున్న సేవలు గొప్పవని కొనియాడారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సత్కరించిన అనంతరం చేతిరాతలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి పురస్కారాలు అందజేశారు.

ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి



గుంటూరు మెడికల్: జిల్లాలో ప్రస్తుతం ప్రబలిన డయేరియా పరిస్థితి రీత్యా డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీల సంఘనేతలతో బుధవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలన్నారు. ఓఆర్ఎస్ ద్రావణం పంపిణీ తప్ప తమ పరిధికి మించి చికిత్స చేయకూడదన్నారు. సెలైన్లు ఎక్కించడం, మందులు ఇవ్వడం వంటివి చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చికిత్స కోసం క్లినిక్‌లకు వచ్చిన డయేరియా బాధితుల సమాచారాన్ని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలోని ఎపిడమిక్ సెల్‌కు తెలియజేయాలన్నారు. పరిస్థితులు సద్దుమణిగే వరకు పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. ప్రోగ్రాం ఆఫీసర్లు, డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, ఆరోగ్య విస్తరణ అధికారి నూనె రామకృష్ణ, సూపర్‌వైజర్ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు 138 మంది హాజరు



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద పల్నాడు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాకు 138 మంది హాజరైనట్లు జిల్లా అధికారి తమ్మాజీరావు తెలిపారు. జాబ్ మేళాలో మొత్తం 10 కంపెనీల ప్రతినిధులు హాజరై ఎంపికలు నిర్వహించారని తెలిపారు. 51 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గవర్నమెంట్ కళాశాల ప్రిన్సిపల్ బీపీ కృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, జిల్లా ఉద్యోగకల్పనా అధికారి ఎం.రవీంద్రనాయక్, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ పి.శ్రీకాంత్, వీరాంజనేయులు, రామకృష్ణారెడ్డి, మస్తాన్, జూనియర్ కాలేజీ వైస్ ప్రిన్సిపల్ ఎం వెంకట నర్సయ్య, కంపెనీ హెచ్ఆర్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

ఎయిమ్స్‌లో కలరా రోగులను పరామర్శించిన సీపీఎం నాయకులు

మంగళగిరి: మంగళగిరి – తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వెంటనే హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న కలరా రోగులను సీపీఎం నాయకులు పరామర్శించారు. అనంతరం నేతాజీ మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాల వలన నీటి కాలుష్యంతో డమేరియా, కలరా బారినపడి అనేకమంది పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించి ప్రజలకు అత్యవసర వైద్య సేవలందించాలన్నారు. గ్రామాలు, పట్టణాలలో పారిశుద్ధ్యం మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సీపీఎం నాయకులు బి.వెంకటేశ్వర్లు, ఎస్ఎస్ చెంగయ్య, ఎస్.గణేష్, షేక్ కాజా తదితరులు పాల్గొన్నారు.

నకిలీ సర్టిఫికెట్ కేసులో రెండేళ్ల జైలు

గుంటూరు లీగల్: నకిలీ సర్టిఫికెట్ ఇచ్చిన కేసులో నిందితుడికి రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధిస్తూ గుంటూరు ఆరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బుధవారం తీర్పు వెలువరించారు. వివరాల్లోకి వెళితే.. 2019లో ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి పోతమరాజు వెంకట శివరామ కృష్ణారావు బాధితుడైన మేకల రవికుమార్‌కు నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చాడు. అయితే డిపార్టుమెంట్ అధికారుల తనిఖీల్లో అది నకిలీ ఆర్డర్ అని గుర్తించారు. ఈమేరకు సెక్షన్ 420, 468, 471 ఐపీసీ సెక్షన్ల కింద ఒకటో నిందితుడిగా మేకల రవికుమార్‌ను, రెండో నిందితుడిగా పోతమరాజు వెంకట శివరామ కృష్ణారావును చేర్చి, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. వాద ప్రతివాదనల విన్న ఆరవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ గౌస్ రెండో నిందితుడైన పోతమరాజు వెంకట శివరామ కృష్ణారావుకు రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించి రూ. 5వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ఒకటో నిందితుడు మేకల రవికుమార్‌ను నిర్దోషిగా తీర్పు చెప్పారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ మురళీకృష్ణ వాదనలు వినిపించినారు.

క్విజ్ పోటీల్లో ఆప్తమాలజీ పీజీ వైద్యుల ప్రతిభ



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల, గుంటూరు జీజీహెచ్ కంటి వైద్య విభాగం పీజీ వైద్య విద్యార్థులు తమ ప్రతిభా, పాటవాలు చాటి రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించారు. ఆంధ్రప్రదేశ్ ఆప్తాల్మిక్ సొసైటీ గుంటూరు ఆధ్వర్యంలో ఈనెల 19 నుంచి 21 వరకు రాష్ట్రస్థాయి కంటి వైద్యుల సమావేశాలు జరిగాయి. సమావేశాల్లో నిర్వహించిన క్విజ్ పోటీల్లో గుంటూరు వైద్య కళాశాల ఆప్తమాలజీ పీజీ వైద్యులు ప్రథమ స్థానాన్ని సాధించారు. ఈనేపథ్యంలో బుధవారం గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారీ రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి ప్రథమ బహుమతి సాధించిన కంటి వైద్య విభాగం పీజీ విద్యార్థులను అభినందించారు. వారికి ఉత్తమ బోధన అందిస్తున్న కంటి వైద్య విభాగాధిపతి డాక్టర్ రవిబాబు, ప్రొఫెసర్లు, అసోసియేట్‌లు, అసిస్టెంట్ ప్రొఫెసర్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవిబాబుతోపాటు, కంటి వైద్యులు సాధన, ఉషాలత, వాణి, శ్రీదేవి, హారిక, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా జాతీయ చెస్ చాంపియన్‌షిప్



చేబ్రోలు: ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ నిర్వహిస్తున్న 62వ జాతీయ చెస్ చాంపియన్‌షిప్ – 2025 పోటీల్లో బుధవారం మూడో రౌండ్‌లో సంచలన ఫలితాలు నమోదయ్యాయి. రైల్వేల జీఎం సయంతన్ దాస్‌ను కేవలం 12 ఏళ్ల ఆంధ్ర ప్రతిభావంతుడు అందమాల హేమల్ వర్షన్ ఓడించి సంచలనం సృష్టించాడు. మూడో రౌండ్ ముగిసే సరికి 27మంది ఆటగాళ్లు తలా మూడు పాయింట్లతో అగ్రగాములుగా ఉన్నారు. కేవలం 12 ఏళ్ల హేమల్ వర్షన్ సిసిలియన్ డిఫెన్స్‌లో జీఎం సయంతన్ దాస్‌పై ఘనవిజయం సాధించాడు. రూక్, మైనర్ పీస్ ఎండ్గేమ్‌లో రెండు అదనపు పాన్ల ఆధిక్యం సాధించిన హేమల్, నైట్ త్యాగం చేసి పాన్‌ను ఎనిమిదవ వరుసకు ప్రమోట్ చేయడంతో దాస్ రాజీనామా చేశారు. ఆంధ్ర ప్రముఖ ఆటగాడు జీఎం లలిత్ బాబు, ట్రాంపోవ్‌స్కీ ఆరంభంలో వేదాంత్ గార్గ్ (ఛత్తీస్‌గఢ్) పై 45 మూవ్‌లలో గెలిచాడు.

ఎన్నారై కళాశాల వద్ద విద్యార్థుల ఆందోళన



మేడికొండూరు: ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉండటం వల్ల మేడికొండూరులోని ఎన్నారై కళాశాల యాజమాన్యం విద్యార్థులను వేధిస్తోందని ఆరోపిస్తూ, బుధవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల వద్ద భారీ ధర్నా జరిగింది. ఫీజులు చెల్లించకపోతే పరీక్ష ఫీజులు కట్టించుకోమని, అలాగే ప్రాక్టికల్ మార్కులు తగ్గిస్తామని బెదిరిస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.పవన్ కుమార్, ఎస్.కె.సమీర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే ఈ పరిస్థితికి కారణమని మండిపడ్డారు. ఎమ్మెల్సీగా ఉన్న ఆలపాటి రాజా కళాశాల యాజమాన్యంలో విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. తక్షణమే ప్రభుత్వం సమస్యపై స్పందించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమస్యపై ఆలపాటి రాజా, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి వెంటనే స్పందించి విద్యార్థులకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు.

ట్యాంకులు ఇలా.. ఆరోగ్యం ఎలా..

- గుంటూరు నగరంలో శిథిలావస్థలో వాటర్ ట్యాంకులు
- పై కప్పులు ఊడిపోయి అధ్వానం
- వాటర్ ట్యాంకుల్లో పక్షుల వ్యర్థాలు
- వీటి ద్వారానే తాగునీటి సరఫరా
- ప్రస్తుతం నగరంలో డయేరియా బారిన పడి 80 మంది చికిత్స పొందుతున్న పరిస్థితి



బీఆర్ స్టేడియంలో వాటర్ ట్యాంకు పై కప్పు పూర్తిగా లేని దృశ్యం



మరో ట్యాంకుపైన ఉన్న రంధ్రాలు

నెహ్రూనగర్: గుంటూరు నగరానికి తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ నుంచి నగరంలోని పలు వాటర్ ట్యాంకులకు నీటి సరఫరా అయి అక్కడ నుంచి పైపులు ద్వారా ఇంటింటికి తాగునీటి సరఫరా జరుగుతుంది. అయితే నగరంలో ఉన్న పలు వాటర్ ట్యాంకులు శిథిలావస్థకు చేరడంతోపాటు పై కప్పులు ఊడిపోవడంతో అధ్వానంగా మారాయి. వీటి ద్వారానే తాగునీటి సరఫరా జరుగుతుండటంతో నగర వాసులు అనారోగ్యం బారిన పడుతున్నారు.

శిథిలావస్థలో ఏడు ట్యాంకులు..

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో 62 వాటర్ ట్యాంకులు ఉన్నాయి (వీటిల్లో 42 ట్యాంకులు నగర పరిధిలో, మిగిలిన విలీన గ్రామాలకు చెందినవి). ఈ 42 వాటర్ ట్యాంకుల్లో ఏడు ప్రాంతాల్లోని 9 వాటర్ ట్యాంకులకు పైకప్పులు ఊడిపోయి అధ్వానంగా మారాయి. బీఆర్ స్టేడియం, నల్లచెరువు, ఏటీ అగ్రహారం, స్తంభాలగరువు, శారదాకాలనీ, వసంతరాయపురం, నెహ్రూనగర్ రిజర్వాయర్లలో ఉన్న వాటర్ ట్యాంకులకు ఉన్న పై కప్పులు సక్రమంగా లేకపోవడంతో వాటిలో పక్షుల వ్యర్థాలు పడుతున్నాయి. ఈ నీటినే అధికారులు నగరంలోని అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. 2018లో బీఆర్ స్టేడియం పరిధిలోని ఆనంద్‌పేటలో 30కి మందికిపైగా డయేరియా బారిన పడి మృతిచెందిన విషయం తెలిసిందే. అప్పుడు హడావుడిగా పాడైపోయిన వాటర్ ట్యాంకులను కవర్ చేస్తూ మరమ్మతులు చేపట్టారు. కాలక్రమేనా అవి కూడా పాడైపోవడంతో వాటిని పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు. తీరా ఇప్పుడు అదే ప్రాంతంలో డయేరియా కేసులు నమోదవుతున్నాయి.

ప్రస్తుతం యాక్టివ్‌గా 80 కేసులు..

గుంటూరు నగర పరిధిలో ఇప్పటివరకు 160 మంది డయేరియా బారిన పడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వీరిలో 80 మంది డిశార్జి అవ్వగా..ఇంకా 80మంది చికిత్స పొందుతున్నారు. ఈకోలి బ్యాక్టీరియా కారణంగా కలరా వ్యాప్తి చెంది 3 కేసులు నమోదవగా.. వారు చికిత్స తీసుకుని డిశార్చి అయ్యారు. ప్రభావిత ప్రాంతాల్లో జిల్లాస్థాయి అధికారులను ఒక్కో వార్డుకు ఒక్కో అధికారిని నియమించారు.

నెలకోసారి సైతం శుభ్రం చేయని వైనం

గుంటూరు నగరంలో ఉన్న 42 వాటర్ ట్యాంకులను నెలకొక సారి శుభ్రం చేయాల్సి ఉంటుంది. కాని ఇందులో చాలా ట్యాంకులను సకాలంలో శుభ్రం చేయడం లేదని గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికి ఇంకా ఈ నెలలో 10 ట్యాంకులను శుభ్రం చేయలేదని వారు చెబుతున్నారు. తాగునీటి సరఫరాపై అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై నగర వాసులు పాలకులు, అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

తక్కెళ్లపాడు నుంచి సరఫరా చేయాలి



గుంటూరు నగరంలో 7 ప్రాంతాల్లో ఉన్న వాటర్ ట్యాంకులు శిథిలావస్థలో పై కప్పులు ఊడిపోయి ఉన్నాయి. 42 వాటర్ ట్యాంకులు నగర పరిధిలో ఉంటే వీటిల్లో 10 ట్యాంకులను ఇంకా శుభ్రం చేయలేదు. డయేరియా ప్రభావిత ప్రాంతాలకు అయా పాడైన వాటర్ ట్యాంకుల నుంచే వాటర్ సప్లయి చేస్తే ప్రయోజనం ఏం ఉండదు. తక్కెళ్లపాడు హెడ్ వాటర్ వర్క్స్ నుంచి ట్యాంకర్ల ద్వారా ప్రభావిత ప్రాంతాల్లో తాగునీరు సరఫరా చేయాలి.

– నారాయణరెడ్డి, గుంటూరు సిటీ మున్సిపల్ రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ దసరా శుభాకాంక్షలు, గుంటూరు జిల్లాలో శ్రీ భ్రమరాంబపురం కాలనీ & జనచైతన్య ప్లాట్స్ & UDA అప్రూవ్డ్ ప్లాట్స్ & పొలములు. అ/కొ. స్పాట్ రిజిస్ట్రేషన్. మస్తాన్ లతీఫ్‌గౌడ్. 9848986831

■ అమరావతి రాజధానిలో అపార్ట్‌మెంట్స్, విల్లాస్ హౌస్‌లు నిర్మించాలనుకున్నారా అయితే మా వద్ద 500-2000గ భూమి తక్కువధరకే సిటీకి3-5 KM దూరంలో అందుబాటులో కలదు. 7680988421

PLOT FOR SALE

■ రెసిడెన్షియల్‌జోన్‌గా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పల్నాడు జిల్లా చిలకలూరిపేట బైపాస్‌కు దగ్గరలో DTCP అప్రూవ్డ్ స్థలాలు అమ్మకమునకు కలవు.చ.గ.రూ.4000/-మాత్రమే.9701688812

■ గుంటూరు నుండి సత్తెనపల్లి వెళ్లే 4 లైన్ల హైవే కంటిపూడి గ్రామం ఆనుకుని ఉన్న వెంచర్‌లో ఓపెన్ ప్లాట్లు అమ్మకానికి కలవు. సం॥ 8668888868

■ తూర్పు ఫేస్ గల 278 చ॥గ॥ ప్లాట్ గుంటూరు, కాకాని రోడ్డులో విజేత పేపర్ మిల్లు ఎదురు రోడ్‌లో ఇండియన్ గ్యాస్ గోడౌన్ దగ్గరలో కలదు. 9177125874, 9963674348

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర॥ 87907 41166

BUSINESS OFFER

■ We are Ready to Invest to Develop Your Business. We also Welcome Agent., Good Commission for Agents Call 90926 92403.

WANTED

■ నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా Software Courses, Softskills & spoken English లలో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశం. Training కాలంలో అభ్యర్థులకు ఉచితంగా భోజనం & వసతి సౌకర్యాలు. 85200 55679

■ కేర్ టేకర్స్ (మెడికల్) జీతం 18వేలు, ఇంటి వంట జీతం18వేలు, బేబికేర్‌టేకర్స్ జీతం 18వేలు, వార్డెన్ భార్యభర్తలు(డిగ్రీ) జీతం 18వేలు+18వేలు. భోజనం, వసతి. 9885498598

■ టాయ్‌మాల్ షోరూం గుంటూరు, నాయుడుపేట నందు పనిచేయుటకు సేల్స్ బాయ్స్ & గర్ల్స్ కావలెను. వయస్సు 30సం॥లోపు. 7702173071, 9849885732

దసరా స్పెషల్ ఆఫర్
సత్తెనపల్లి మున్సిపల్ లిమిట్స్‌లో గేటెడ్ కమ్యూనిటీ ఏరియాలో
2 & 3 బెడ్ రూమ్ ఫ్లాట్స్
₹.2,500/- మాత్రమే
97016 89312

■ షాప్‌లో పనిచేయుటకు గుమస్తాలు కావలెను. గుంటూరు సిటీ లోకల్ వారు మాత్రమే సంప్రదించగలరు. సెల్ : 8142842888, 8639348580

■ తెనాలిలోని ప్రముఖ కంపెనీకి MS ఆఫీస్ అనుభవం గల స్టాఫ్ (Male) MBA / BBA చదివిన అడ్మినిస్ట్రేటివ్ సిబ్బంది కావలెను. మంచి జీతం. 9490457852, 9490457859

■ గుంటూరు లక్ష్మీపురంలోని ప్రముఖ డెంటల్ హాస్పిటల్ నందు P/F టైమ్ పనిచేయుటకు M/F రిసెప్షనిస్ట్ & క్లీనింగ్ స్టాఫ్ కావలెను. లోకల్ వారు సంప్ర: 85008 08778

■ ప్రముఖ MNC ఈ కామర్స్ వారి అనుబంధ సంస్థలలో వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. అర్హత: 10th–డిగ్రీ, మంచి జీతం కలదు. సంప్రదించండి. 8217807942

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4 లైన్స్)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని విశేషంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.